## కొత్త ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించిన హోంమంత్రి

అబిడ్స్ : కత్తిపోటుకు గురై యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుబ్బాక బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. దవాఖానలో చికిత్స పొందుతున్న ప్రభాకర్‌రెడ్డిని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, ఆజాం అలీ, ఎంకే బద్రుద్దీన్ పరామర్శించారు.




ఓయూలో జరిగిన 83 వ స్నాతకోత్సవంలో వీసీ ప్రొఫెసర్ రవీందర్, అడోబ్ సంస్థ చైర్మన్ అండ్ సీఈవో డాక్టర్ శంతన్ నారాయణ్ నుంచి డాక్టరేట్‌ను అందుకుంటున్న సీనియర్ జర్నలిస్ట్ నాగేశ్వరరావు. - జూబ్లీహిల్స్



వివరాలను వెల్లడిస్తున్న ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

## జిల్లాలో రూ.17.64 కోట్ల నగదు

- రూ.24 కోట్ల బంగారు ఆభరణాలు స్వాధీనం: కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన తనిఖీల్లో భాగంగా మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో రూ. 17.64 కోట్ల నగదు, రూ. 24.66 కోట్ల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 84.445 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్సైజ్ అధికారులు 508 కేసులు నమోదు చేసి, 262 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు.

### రూ. 4.30 కోట్ల నగదు అప్పగింత..

జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా రూ. 4 కోట్ల 30 లక్షల 90 వేల నగదును తిరిగి అప్పగించినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. పట్టుబడిన నగదుకు సరైన ఆధారాలు చూపించిన వారికి తిరిగి అందజేస్తున్నట్లు చెప్పారు. గ్రీవెన్స్ కమిటీకి 185 కేసులు రాగా.. అందులో 141 కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు.

### ఆసిఫ్‌నగర్‌లో రూ.21.50 లక్షల నగదు పట్టివేత

మెహిదీపట్నం: మల్లేపల్లి చౌరస్తాలో ఫ్లయింగ్ స్క్వాడ్ బుధవారం వాహనాల తనిఖీ చేపట్టింది. ఓ కారును ఆపి తనిఖీ చేయగా.. అందులో రూ. 21.50 లక్షల నగదు పట్టుబడింది. ఆసిఫ్‌నగర్ పోలీసులు ఈ నగదును స్వాధీనం చేసుకుని, ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

## అమీర్‌పేటలో పోలీసుల తనిఖీలు

- రూ.8 లక్షలు, 10 వాహనాలు సీజ్

వెంగళరావునగర్, నవంబర్ 1: ఎన్నికల నేపథ్యంలో సనత్‌నగర్ నియోజకవర్గం ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం (ఎఫ్‌ఎస్), ఎస్సార్‌నగర్ పోలీసులు కలిసి బుధవారం అమీర్‌పేట ధరం కరమ్ రోడ్డులో విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. సుమారు 200 వాహనాలను తనిఖీ చేశారు. ఎటువంటి పత్రాలు, నంబర్ ప్లేట్లు లేకుండా ఉన్న 10 వాహనాలను సీజ్‌చేసి, కేసులు నమోదు చేశారు. ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న రూ.8 లక్షల నగదును ఎస్సార్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నగదుకు సంబంధించిన ఆధారాలు చూపలేదని, దీంతో నగదును సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ తనిఖీల్లో నియోజకవర్గం ఎన్నికల నోడల్ అధికారి, ఎస్సార్‌నగర్ డివిజన్ ఏసీపీ వై.వెంకటేశ్వర రావు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం ఇన్‌చార్జి ఉపేంద్ర, ఎస్సార్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పి.వి.రామ్ ప్రసాద రావు నేతృత్వంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# లాభాల పేరిట ఘరానా మోసం

- 200 మంది నుంచి రూ.530 కోట్లు వసూలు
- గొలుసు కట్టు విధానంలో పెట్టుబడుల ఆకర్షణ
- ఇద్దరు వ్యాపారులు అరెస్టు.. 2 కిలోల బంగారం స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న నగర జాయింట్ సీపీ గజారావు భూపాల్

సిటీబ్యూరో, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): మా వద్ద పెట్టుబడి పెడితే 6 నుంచి 13 శాతం వరకు ప్రతి నెలా లాభాలిస్తామంటూ రెండు తెలుగు రాష్ట్రాలలో 200 మంది నుంచి రూ. 530 కోట్లు వసూలు చేసి, మోసం చేసిన ఇద్దరిని సీసీఎస్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. బుధవారం సీసీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర జాయింట్ సీపీ గజారావు భూపాల్, సీసీఎస్ డీసీపీ శిల్పవల్లి వివరాలను వెల్లడించారు. విజయవాడకు చెందిన గుడే రాంబాబు, భీమవరానికి చెందిన పెనుమెట్స కృష్ణంరాజు వ్యాపార భాగస్వాములు. లాభాలు రావడంతో వ్యాపారాన్ని విస్తరించేందుకు నిర్ణయించారు. ఇందుకు తెలిసిన వారి నుంచి ఆర్థిక సాయం తీసుకున్నారు. మొదట్లో మూవింగ్ కన్జ్యుమర్ గూడ్స్‌ను విక్రయిస్తూ, ఆ వ్యాపారాన్ని మరింతగా విస్తరించారు. ఇందుకు తెలిసిన వారు, బంధువులు, స్నేహితుల నుంచి భారీ ఎత్తున పెట్టుబడులు సేకరించారు. పెట్టుబడి పెట్టిన వారికి తొలుత కొన్ని నెలలు 6 శాతం లాభాల చెల్లించారు. ఇలా దాదాపు 200 మంది నుంచి రూ. 530 కోట్లు వరకు వసూలు చేశారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వరకు వచ్చారు. వ్యాపారాన్ని గొలుసు కట్టు విధానంలోకి మార్చేశారు. పెట్టుబడి పెట్టిన వారికి ఇటీవల లాభాలు చెల్లించడంలో ఆలస్యం చేశారు. దీంతో బాధితుల నుంచి ఒత్తిడి పెరగడంతో మాదాపూర్‌లో ఉన్న ఇంటికి తాళం వేసి.. నిందితులిద్దరూ పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు వీరిద్దరిపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను గచ్చిబౌలిలో అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు కిలోల బంగారు ఆభరణాలు, రూ.4 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరూ ఏపీ, తెలంగాణలో బాధితుల నుంచి వసూలు చేసిన డబ్బుతో ఆస్తులు కొనుగోలు చేసినట్టు దర్యాప్తులో తేలిందని వెల్లడించారు.



## గంటలోనే ఛేదించి.. తల్లిదండ్రులకు అప్పగించి..

చార్మినార్, నవంబర్ 1: బాలుడు కనిపించడం లేదని ఫిర్యాదు అందిన వెంటనే అప్రమత్తమైన ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి, గంట వ్యవధిలోనే బాలుడిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ కథనం ప్రకారం..అప్పుడుల్లా హోటల్ సమీపంలో నివసించే మహ్మద్ అక్బర్ 11 ఏండ్ల కుమారుడు మహ్మద్ రెయాన్ మంగళవారం పాఠశాల నుంచి ఇంటికి వచ్చి.. స్నేహితులతో కలిసి ఆడుకునేందుకు బయటకు వెళ్లాడు. రాత్రి పొద్దుపోయిన తర్వాత కూడా బాలుడు ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన మహ్మద్ అక్బర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి.. బాలుడి ఆచూకీ కోసం రెండు ప్రత్యేక పోలీసు టీమ్‌లను రంగంలోకి దింపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఓ టీమ్ పరిశీలించగా.. మరో టీమ్ దర్యాప్తు వేగవంతం చేసింది. సుమారు 60 సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు.. చిన్న క్లూ లభించింది. ఆ క్లూ ఆధారంగా చార్మినార్ సమీపంలో బాలుడు ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లారు. మొఘల్‌పురా అగ్నిమాపక కేంద్రం వద్ద బాలుడు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. బాలుడిని గుర్తించి బహదూర్‌పురా పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



మేడ్చల్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో శాసనసభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు సంబంధించి కేంద్రాలు, అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 3వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో అభ్యర్థితో పాటు మరో నాలుగురికి మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతి ఉంటుందని ఎన్నికల అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు 48 గంటల ముందు సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఆన్‌లైన్‌లో ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా సంబంధిత రిటర్నింగ్ అధికారి ద్వారా అనుమతి తీసుకోవచ్చని సూచించారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్ ప్రసారాలు, ప్రచురణలపై ఎన్నికల సంఘం నిషేధం విధించిందని కలెక్టర్ వెల్లడించారు. ఈ నెల 7 నుంచి 30వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్‌పై ప్రసారాలు, ప్రచురణలపై నిషేధం అమలులో ఉంటుందన్నారు. ఈ విషయంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా రెండేళ్ల జైలు శిక్ష, జరిమానాలు.. రెండు ఉంటాయని కలెక్టర్ తెలిపారు.

### రేపటి నుంచి 29 నియోజకవర్గాల్లో 144 సెక్షన్

సిటీబ్యూరో, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం ఈ నెల 3 నుంచి మొదలు కానున్నది. దీంతో పోలీసు శాఖ మరింత అప్రమత్తమైంది. మహానగరంలోని మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో ఉన్న 29 అసెంబ్లీ నియోజకవర్గాల్లో శుక్రవారం నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటున్నదని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. దీంతో పాటు నామినేషన్ కేంద్రాల వద్ద నాలుగు అంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లను ఆకర్షించేందుకు ఆయా పార్టీలు డబ్బు, మద్యం, ఇతర వస్తువులను ఎరగా వేసే అవకాశాలు అధికంగా ఉండటంతో రేపటి నుంచి తనిఖీలను మరింత పకడ్బందీగా చేయాలని ఎన్నికల సంఘం నుంచి పోలీసు శాఖకు ఆదేశాలందాయి. ఈ మేరకు అప్రమత్తమైన పోలీసులు తనిఖీలను మరింత ముమ్మరం చేశారు. సెక్టార్ వారీగా తనిఖీలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. అదేవిధంగా.. వీడియో రికార్డింగ్ మధ్య చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించనున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో స్థానిక పోలీసులతో పాటు కేంద్రం నుంచి వచ్చిన అదనపు బలగాలతో ముమ్మరంగా గస్తీ చేయించి, నిఘాను పెంచారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు.

## ఎస్‌బీఐ వితరణ

జూబ్లీహిల్స్, నవంబర్1: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్‌లో సామాజిక అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేపట్టడంలో అగ్రగామిగా నిలుస్తుందని ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ రాజా అశుతోశ్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా అల్కాస్‌గూడలోని మాతృదేవోభవ అనాథాశ్రమానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద టాటా వింగర్ వాహనాన్ని విరాళంగా అందజేశారు. ఈ ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న 120 మంది నిరుపేదలు, దివ్యాంగులను వైద్య సహాయం కోసం దవాఖానలకు తరలించేందుకు ఈ వాహనాన్ని అందజేసినట్లు అశుతోశ్ కుమార్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా 2018 నుంచి ఆశ్రమాన్ని నడిపిస్తున్న యాదయ్యను అభినందించి, వాహనం తాళాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్, జనరల్ మేనేజర్ (ఎన్‌డబ్ల్యూ-1) మంజు శర్మ, జనరల్ మేనేజర్ (ఎన్‌డబ్ల్యూ-2) దేబాషిశ్ మిత్రా, జీఎం సీసీజీఆర్‌వో విద్యారాజా, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామకృష్ణ, డిప్యూటీ జనరల్ మేనేజర్లు, సీనియర్ మేనేజ్‌మెంట్ స్టాఫ్ పాల్గొన్నారు.

